సాక్షి నంద్యాల

బుధవారం ၊ 30 ၊ జూలై ၊ 2025



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: మల్లన్న ఆలయంలోని శనగల బసవన్నకు, శ్రీబయలువీరభద్ర స్వామి మంగళవారం శాస్త్రోక్తంగా ఆలయ అధికారులు, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు.

మద్యం కిక్కు.. ఆరోగ్యానికి చిక్కు



మద్యం తాగడం ఆరోగ్యానికి హానికరం. ఇది అన్ని మద్యం బాటిళ్లపై రాసి ఉంటుంది. ఇందులో నాణ్యమైన మద్యం, కల్తీ మద్యం అన్న తేడా ఉండదు. ఏ మద్యం తాగినా కాలేయం చెడిపోవడం తథ్యం.

8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,624.62
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:75.258
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:1,27,810
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:1,24,487

న్యూస్‌రీల్

వైభవంగా గరుడ పంచమి వేడుకలు



గరుత్మంతుడికి హారతి ఇస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: అహోబిలం క్షేత్రంలో గరుడ పంచమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. గరుడ పంచమిని పురస్కరించుకుని మంగళవారం దిగువ అహోబిలంలో మూలమూర్తులు శ్రీ ప్రహ్లాదవరద స్వామి, అమృతవల్లీ అమ్మవార్లకు నిత్య పూజల అనంతరం ప్రత్యేక గరుడ పంచమి పూజలు చేపట్టారు. అనంతరం దేవాలయం ఎదురుగా ధ్వజ స్తంభం దగ్గర కొలువైన మూలమూర్తి గరుత్మంతుడికి వేద పండితుల వేదమంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా పంచామృతాలతో అభిషేకించి తిరుమంజనం సేవ నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి కార్యక్రమాన్ని ముగించారు. ప్రధానార్చకులు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యానారాయణ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



వసతి గృహ నిర్మాణానికి భూమిపూజ చేసిన డీఈఓ జనార్దన్‌రెడ్డి

ఆత్మకూరు: అడవి బిడ్డలు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని డీఈఓ జనార్దన్‌రెడ్డి అన్నారు. బైర్లూటీ చెంచుగూడెంలో రూ.2.30 కోట్లతో నూతన గిరిజన బాలుర వసతిగృహ నిర్మాణానికి మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ చెంచు గిరిజన విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకుని గూడేలకు మంచి పేరు తేవాలన్నారు. క్రమశిక్షణతో చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఎంఈఓ మేరీమార్గరేట్, సమగ్రశిక్ష ఈఈ శ్రీనివాసులు, సర్పంచ్ గురువమ్మ, ఏఈ శంకరయ్య, గిరిజన విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన కల్పించండి



పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు

కొత్తపల్లి: ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై వైద్య, ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా నివారణ అధికారి చంద్రశేఖర్ సూచించారు. మంగళవారం గువ్వలకుంట్ల గ్రామ ఎస్సీకాలనీలో డాక్టర్ మహమ్మద్ బేగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. అనంతరం కాలనీలో ఎక్కడైనా నీటిక లుషితం జరిగిందా అని ఆరా తీశారు. కాలనీకి నీటి సఫరా అయ్యే బావినీటిని, చేతిపంపులు, ఇళ్లలోని నీటినిల్వ డ్రమ్ములు, తొట్టిలు, కాలనీ పరిసర ప్రాంతాలను, మురికి కుంటలను పరిశీలించారు. నీటిసరఫరా అయ్యే బావిని శుభ్రంచేయించి బ్లీచింగ్ పౌడర్ వేయాలన్నారు. నీటిని ఎక్కువరోజులు నిల్వ ఉంచకుండా, రోజుమరచిరోజు తొట్టిలు, డ్రమ్ములను శుభ్రం చేయించేలా ఆశాలు చూడాలన్నారు. గ్రామస్తులకు ఎక్కువగా టైఫాయిడ్ లక్షణాలు ఉన్నందును గ్రామంలో సరఫరా అయ్యే నీటిని పరీక్షలకు పంపించామన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున కాచిన నీటిని తాగాలని సూచించారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీఓ సుబ్బరావు, పంచాయతీ కార్యదర్శి చిన్నస్వామి, వైద్య, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

కొత్తూరులో విజిలెన్స్ ఎస్పీ పూజలు



విజిలెన్స్ ఎస్పీ చాముండేశ్వరికి తీర్థప్రసాదాలు అందజేస్తున్న దృశ్యం

పాణ్యం: కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణేశ్వర్యస్వామి ఆలయంలో ఉమ్మడి జిల్లా విజిలెన్స్ ఎస్పీ చాముండేశ్వరి పూజలు చేశారు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం ఆలయ మర్యాదలతో ఆమెకు శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

అటకెక్కిన 'ఆడబిడ్డ నిధి'

- 2024 ఎన్నికల సమయంలో ఊరూవాడా మారుమోగిన హామీ
- రూ.1,500 చొప్పున ఖాతాల్లో జమచేస్తామని ప్రచారం
- 14 నెలలు గడిచినా ఆ ఊసెత్తని కూటమి నేతలు
- ఇప్పుడు అమలుపై మాట మార్చిన సీఎం చంద్రబాబు
- ఆడబిడ్డల దృష్టి మళ్లించేందుకు తెరపైకి పీ–4
- దాతల దయాదాక్షిణ్యాలు మాకొద్దని మహిళల ఆగ్రహం



ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలి



సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడం ద్వారా ప్రభుత్వమే పేదరికాన్ని నిర్మూలించాలి. ఈ బాధ్యతను దాతలపైకి నెట్టడం దారుణం. ఎన్నికల సమయంలో ఊరూవాడా ఆడబిడ్డ నిధి పేరిట హామీలు గుప్పించారు. ఇప్పుడు పక్కకు తప్పుకుంటే ఒప్పుకోం.

– ఎం.సుంకులమ్మ, సర్పంచ్, ఉల్లిందకొండ, కల్లూరు మండలం

హామీకి మంగళం దాతల దయాదాక్షిణ్యం

కర్నూలు(అగ్రికల్చర్): "ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1,500 నేరుగా మీ ఖాతాలో జమచేస్తాం. మీ ఇంటిలో ఇద్దరు ఉంటే ఇద్దరికి, ముగ్గురు ఉంటే ముగ్గురికి కూడా ఈ మొత్తాన్ని అందిస్తాం. 18 నుంచి 59 ఏళ్లలోపు వయస్సు మహిళలందరికీ ఆడబిడ్డ నిధి పథకాన్ని వర్తింపజేస్తాం." అంటూ 2024 మే నెలలో జరిగిన ఎన్నికల సమయంలో అన్ని ప్రచార సభల్లోనూ కూటమి నేతలు హోరెత్తించారు. నీకు.. నీకు.. నీకు అంటూ వేలితో చూపించి మీ అకౌంటుకు నెలకు రూ.1,500 ప్రకారం వేస్తామని ఊరూవాడా నమ్మబలికారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి దాదాపు 14 నెలలు అవుతోంది. ఇంతవరకు ఆడబిడ్డనిధి జాడ లేకుండాపోయింది. కూటమి నేతల వైఖరి చూస్తే ఆడబిడ్డ నిధిని గంగలో కలిపినట్లు తెలుస్తోంది. ఈ పథకాన్ని అమలు చేయలేక చేతులెత్తేసిన ముఖ్యమంత్రి ప్రజల దృష్టి మళ్లించేందుకు పీ–4 కార్యక్రమాన్ని తెరమీదకు తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది. దాతల దయాదాక్షిణ్యాల మీద బతికే దుస్థితి తీసుకురావడం పట్ల మహిళల్లో నిరసన వ్యక్తమవుతోంది. ఉమ్మడి జిల్లాలో రైస్‌కార్డులు కలిగిన కుటుంబాలు దాదాపు 16 లక్షల వరకు ఉన్నాయి.

ఆడబిడ్డ నిధి లేనట్లే..

2024 ఎన్నికల సమయంలో ఊరూవాడ మారుమోగిన ఆడబిడ్డ నిధి పథకానికి ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళం పలికినట్లేనని టీడీపీ నేతలే పేర్కొంటున్నారు. ఈ పథకాన్ని అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మాల్సిందేనని ఇటీవల వ్యవసాయ అనుబంధ శాఖల మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొనడం పట్ల మహిళల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని 2024–25లో ఎగ్గొట్టి.. 2025–26లో అరకొరగా అమలు చేసింది. ఆడబిడ్డ నిధికి పూర్తిగా మంగళం పలుకుతుండటం పట్ల మహిళల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.



ఈ కుటుంబాలన్నీ దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవే. అయితే బంగారు కుటుంబాలుగా కర్నూలు జిల్లాలో 64,178, నంద్యాల జిల్లాలో 43,021 కుటుంబాలను మాత్రమే ఎంపిక చేయడం గమనార్హం.

బలవంతపు దత్తత

ఆడబిడ్డ నిధి సహా వివిధ ఎన్నికల హామీలకు మంగళం పలుకుతున్న కూటమి ప్రభుత్వం మహిళల దృష్టి మళ్లించేందుకు పబ్లిక్, ప్రైవేటు, పీపుల్స్, పార్టనర్‌షిప్(పీ4)ను తెరపైకి తీసుకొచ్చింది. ఇందులో ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయదు. కార్పొరేట్ కంపెనీలు, పరిశ్రమల నిర్వాహకులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు నిరుపేద కుటుంబాలను దత్తత తీసుకొని బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దాలి. దాతల దయాదాక్షిణ్యాల మీద ఈ కుటుంబాలు బతికే దుస్థితికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకొచ్చారని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కర్నూలు జిల్లాలో 64,178, నంద్యాల జిల్లాలో 43,021 కుటుంబాలను అత్యంత నిరుపేద కుటుంబాలుగా ఆయా జిల్లాల యంత్రాంగం ఎంపిక చేసింది. ఇందులో కర్నూలు జిల్లాలో 34,385, నంద్యాల జిల్లాలో 40,231 కుటుంబాలను దాతలు దత్తత తీసుకున్నారు. ఇందుకోసం కర్నూలు జిల్లాలో 4,443, నంద్యాల జిల్లాలో 5,150 మంది మార్గదర్శలను ఎంపిక చేశారు. బలవంతంగా మార్గదర్శకులను ఎంపిక చేస్తుండటం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది.

విజయవంతంగా వైఎస్సార్ చేయూత

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 18–59 ఏళ్ల వయస్సు మహిళలకు వైఎస్సార్ చేయూత పథకాన్ని అమలు చేసింది. ఒక్కో మహిళకు ఏడాదికి రూ.18,870 ప్రకారం విడుదల చేసిది. నాలుగేళ్లలో వైఎస్సార్ చేయూత కింద రూ.1,954.92 కోట్లు నేరుగా మహిళల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం విశేషం. వైఎస్సార్ చేయూత పథకాన్నే టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఆడబిడ్డ నిధిగా మార్చు చేశారు. 18–59 ఏళ్ల వయస్సు మహిళలు కుటుంబంలో ఎంతమంది ఉంటే అందరికీ నెలకు రూ.1,500 ప్రకారం నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని చెప్పి నమ్మించడం గమనార్హం.

దాతల దయాదాక్షిణ్యాలు వద్దు



ఆడబిడ్డనిధి పథకాన్ని పక్కన పెట్టి పీ4 పేరిట ముఖ్యమంత్రి మహిళలను మోసం చేస్తున్నారు. పీ4 కింద ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయదు. దాతల దయాదాక్షిణ్యాల మీద బతికే పరిస్థితిని ముఖ్యమంత్రి తీసుకరావడం దారుణం. మాకు పీ–4 వద్దు.. ఆడబిడ్డ నిధి అమలు చేయాలి.

– ఆవుల ఆదిలక్ష్మి, జ్యోతి గ్రూపు, కదమకుంట్ల, తుగ్గలి మండలం

అప్పుల ఊబిలో కూరుకుపోయాం



పొదుపు మహిళలు బ్యాంకుల నుంచి తీసుకునే రుణాలపై రూ.10 లక్షల వరకు సున్నా వడ్డీ రుణాలు అమలు చేస్తామన్నారు. ఇంతవరకు ఆ ఊసే కరువైంది. బ్యాంకుల నుంచి రుణాలు పొందిన మహిళలు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. మహిళా సంక్షేమానికి ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం దారుణం.

– బి.రమాదేవి, పొదుపు మహిళ, రామకృష్ణాపురం, క్రిష్ణగిరి మండలం

ఉపాధ్యాయులను మినహాయించండి

ఆదోని సెంట్రల్: ప్రభుత్వం పీ–4 పథకం బాధ్యతల నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని ఎస్టీయూ రాష్ట్ర పురపాలక కన్వీనర్ జి.వీరచంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం గుర్తించిన పేద కుటుంబాలను సంపన్న వర్గాలకు చెందిన వారు దత్తత తీసుకొని వారికి ఆర్థికంగా తోడ్పాటు అందించే కార్యక్రమంలో ఉపాధ్యాయులను భాగస్వాములు కావాలనడం సరికాదన్నారు. ప్రతి ప్రధానోపాధ్యాయుడు ఐదు కుటుంబాలు, ప్రతి ఉపాధ్యాయుడు రెండు కుటుంబాలను దత్తత తీసుకొని మార్గదర్శులుగా నమోదు చేసుకోవాలని బలవంతం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. జీతం మీద ఆధారపడిన ఉద్యోగులకు అంతస్థాయి ఎక్కడిదన్నారు. ఇప్పటికే బోధనేతర పనులతో సతమతం అవుతున్నామని, ఈ నేపథ్యంలోనే మరింత వేధింపులకు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు.

కేంద్ర పథకాలను పటిష్టంగా అమలు చేయాలి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల: కేంద్ర ప్రభుత్వ పథకాలను పటిష్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనుల పరిశీలనకు వచ్చిన జాతీయ స్థాయి పర్యవేక్షణ కేంద్ర బృందం, జిల్లా అధికారులతో కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సంతోష్ ఫరీదా ఆధ్వర్యంలో కేంద్ర బృందం ఈనెల 19 నుంచి 29 వరకు జిల్లాలో పర్యటించిందన్నారు. ఉయ్యాలవాడ, జూపాడుబంగ్లా, నంద్యాల మండలంలోని పొంపల్లి, గోవిందపల్లి, జంబులదిన్నె, పొరుమంచాల, జూపాడుబంగ్లా, లింగందిన్నె, భీమవరం, బిల్లలాపురం గ్రామపంచాయతీలు సందర్శించి వివిధ కేంద్ర పథకాల కింద అమలవుతున్న పనులను పరిశీలించిందన్నారు. పర్యటనలో గుర్తించిన విధానపరమైన అంశాలను బృందం సభ్యులు సంబంధిత శాఖల అధికారులతో కూలంకషంగా చర్చించారన్నారు. పలు అంశాలలో తీసుకోవాల్సిన చర్యలు, చేపట్టాల్సిన పనులపై పలు సలహాలు, సూచనలు ఇచ్చారన్నారు. సమావేశంలో ఎస్‌ఎల్‌ఎం సభ్యులు సూర్య ప్రదాన్, డ్వామా పీడీ సూర్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

రానున్న ఐదు రోజులు ఎండ, గాలులే!

కర్నూలు(అగ్రికల్చర్): రానున్న ఐదు రోజులు జిల్లాలో ఎండలతో పాటు గాలుల తీవ్రతతో పెరిగే అవకాశం ఉందని వాతావరణ అధికారులు తెలిపారు. ఇటు కర్నూలు, అటు నంద్యాల జిల్లాలో ఆగస్టు నెల 3వ తేదీ వరకు వర్షపాత సూచనలు లేవని అనంతపురం వ్యవసాయ వాతావరణ విభాగం అధికారులు ప్రకటించారు. ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఒకటి, రెండు డిగ్రీలు అధికంగా నమోదయ్యే అవకాశం ఉంది. ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా 35–36 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గాలుల తీవ్రత ఎక్కువగా ఉంటోంది. గంటకు 12–13 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని అధికారులు తెలిపారు. జూలై మాసంలో చాలా వరకు అంతంతమాత్రం తేలిక పాటి వర్షాలు పడటంతో పంటల పరిస్థితి నిరాశ జనకంగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది.

విద్యాసంస్కరణలపై ప్రిన్సిపాళ్లకు అవగాహన

నంద్యాల(న్యూటౌన్): బోర్డు ఆఫ్ ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ కొత్తగా తీసుకున్న విద్యాసంస్కరణపై జిల్లాలోని అన్ని యాజమాన్య కళాశాల ప్రిన్సిపాళ్లకు అవగాహన కల్పించినట్లు జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి శంకర్‌నాయక్ మంగళవారం తెలిపారు. సిలబస్ సబ్జెక్టుల కలయిక, ప్రశ్నాపత్రాల మార్పుల గురించి వివరించారు. గ్రూప్ సబ్జెక్టులతో పాటు పార్ట్–1, ఇంగ్లిష్ పార్ట్–2, ద్వితీయ భాషగా తెలుగు, సంస్కృతం, ఉర్దూ, అరబిక్, తమిళ్, కన్నడ, ఒరియా, ప్రధాన సబ్జెక్టులు అయిన గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, హిస్టర్, ఎకనామిక్స్, సివిక్స్ లేదా మైనర్ సబ్జెక్టులు జాగ్రఫీ, లాజిక్, పబ్లిక్ అడ్మిస్ట్రేషన్, మోడల్ లాంగ్వేజ్ ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూలో ఒక సబ్జెక్టు ఎంపిక చేసుకోవచ్చన్నారు. ఎంపీసీ విద్యార్థులు అడిషనల్‌గా 6వ సబ్జెక్టు బయాలజీ, బైపీసీ విద్యార్థులకు అడిషనల్ సబ్జెక్టుగా గణితం ఎంపిక చేసుకోవచ్చన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి

- జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్



మాట్లాడుతున్న జేసీ విష్ణుచరణ్

నంద్యాల: జిల్లాలో సహకార సంఘాల బలోపేతానికి కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో జిల్లా కో–ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. జిల్లాలో 56 కో–ఆపరేటివ్ సొసైటీలను ఆర్థికంగా బలోపేతం చేసి మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా నాబార్డు, డీసీసీబీలు ఆర్థికంగా మద్దతు అందించాల్సిన అవసరం ఉందన్నా రు. మల్టీపర్పస్ ఫెసిలిటీస్ సెంటర్ గోడౌన్స్ రైతుల అవసరం మేరకు ఇవ్వాలన్నారు. జిల్లాలో పండిస్తున్న పంటలకు అనవసరంగా యూరియా వాడకూడదని, యూరియా ఎక్కువగా వాడటం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. ఒక ఎకరాకు రెండు బ్యాగులు మాత్రమే యూరియా వాడాలని అధిక మోతాదులో వినియోగిస్తే పంట దిగుబడి తగ్గిపోవడంతో పాటు భూసారం నిర్వీర్యమవుతుందన్నారు. నానో యూరియా పిచికారీపై అవగాహన పెంచు కోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కో–ఆపరేటివ్ అధికారి రామాంజనేయులు, నాబార్డు డీడీఎం కార్తికేయ, డీసీసీబీ శివలీల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమాన్ని విస్మరిస్తే గుణపాఠం తప్పదు



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు

ఓర్వకల్లు: పేద విద్యార్థుల సంక్షేమాన్ని విస్మరిస్తే కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని వైఎస్సార్‌సీపీ విభాగం నంద్యాల జిల్లా అధ్యక్షుడు సురేష్ యాదవ్ హెచ్చరించారు. పార్టీ ఆదేశాల మేరకు 'సంక్షేమ హాస్టళ్ల బాట' కార్యక్రమంలో భాగంగా మంగళవారం కాల్వబుగ్గ గురుకుల పాఠశాలలోని వసతి గృహాన్ని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులతో కలసి ఆయన సందర్శించారు. వసతి గృహంలో నెలకొన్న సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సురేష్ యాదవ్ మాట్లాడుతూ.. వసతి గృహంలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగు దొడ్లు లేవన్నారు. సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. గత ప్రభుత్వ పాలనలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండేళ్లు కరోనా పోగా, మిగతా మూడేళ్లలో విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చారన్నారు. నాడు–నేడుతో శాశ్వత పరిష్కారం చూపారని గుర్తుచేశారు. 42 ఏళ్ల రాజకీయ అనుభవం, 4 సార్లు ముఖ్యమంత్రిగా పని చేసిన ప్రస్తుత సీఎం చంద్రబాబు నాయుడు గొప్పలు చెప్పుకోవడమే గానీ విద్యార్థులను పట్టించుకొన్న పాపాన పోలేదని మండిపడ్డారు. జగనన్న ప్రభుత్వంలో హాస్టల్ విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు, దుప్ప ట్లు, ట్రంకు పెట్టెలు సకాలంలో అందేవని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇంతవరకు ఏమి ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులను విద్యకు దూరం చేయాలనే కుట్రపన్నుతున్న కూ టమి ప్రభుత్వానికి పుట్టగతులు వుండవని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి పాయి, జిల్లా నాయకులు తిరుమలేష్, కర్నూలు మండల అధ్యక్షులు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థ కాలుష్యాన్ని నివారిద్దాం

- ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ కృష్ణయ్య



మాట్లాడుతున్న ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ కృష్ణయ్య

బేతంచెర్ల: పరిశ్రమలు, గనుల నుంచి వెలువడే వ్యర్థ కాలుష్యాన్ని నివారించేందుకు అందరూ సహకరించాలని ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ కృష్ణయ్య అన్నారు. మంగళవారం పట్టణంలోని అయ్యల చెర్వులో నాపరాళ్ల పరిశ్రమల యజమానులు, సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాపరాళ్ల గనుల యజమానులు ఒక క్లస్టర్‌గా ఏర్పడి దరఖాస్తు చేసుకుంటే 90 రోజుల్లోగా క్లస్టర్ ఈసీల మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. నాపరాళ్ల గనుల ఈసీల సమస్యలతో పాటు, పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలను సిమెంట్ పరిశ్రమలో ఉపయోగించుకునే విధానంపై చర్చించారు. నాపరాళ్ల పరిశ్రమల వేస్టేజీని పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీ మాత్రమే వాడుకుంటామని తెలపగా, మహా సిమెంట్, జిందాల్, రామ్‌కో సిమెంట్ యాజమాన్యాలు తమకు వాడుకోవడానికి వీలుపడదని స్పష్టం చేశాయి. బేతంచెర్ల నాపరాళ్ల పరిశ్రమల యజమానులు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నంద్యాల ఏజీ మైన్స్ అధికారి శ్రీనివాస్, పరిశ్రమల యజమానులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలు మగ్గుతున్నాయ్

రుద్రవరం: చిత్రంలో సంచుల్లో కనిపిస్తున్నవి రుద్రవరం వ్యవసాయ కార్యాలయంలోని సబ్సిడీ కంది, మినుము విత్తనాలు. నెల రోజుల క్రితం ఇక్కడికి చేరుకున్నాయి. రోజూ.. రైతులు ఇక్కడికి వచ్చి సబ్సిడీ విత్తనాలు ఎప్పుడు పంపిణీ చేస్తారని అడగటం, అధికారులు మాత్రం రేపు..మాపు అంటూ జాప్యం చేస్తూ వచ్చారు. ఇప్పటికే ఖరీఫ్ ప్రారంభమై రెండు నెలలు కావస్తోంది. ఈ విత్తనాలు పంపిణీ చేసి ఉంటే పొలాల్లో మొలకెత్తి పంట పచ్చగా కళకళలాడేది. పంపిణీ చేయకపోవడంతో నెల రోజులుగా కుట్టేసిన సంచుల్లో 16 క్వింటాళ్ల కందులు, 20 క్వింటాళ్ల మినుములు మగ్గిపోతున్నాయి. రోజూ కార్యాలయం తలుపులు తెరుస్తున్నారు.. అధికారులు వస్తున్నారు.. రైతులు విత్తనాలు ఇంకెప్పుడిస్తారని అని అడుగుతున్నారు.. అయినా విత్తనాలు గేటు దాటని పరిస్థితి నెలకొంది. ఓ ప్రజా ప్రతినిధి చేతుల మీదుగా రైతులకు పంపిణీ చేయాలని స్థానిక అధికారులు, నేతలు భావించారు. అయితే ఇప్పుడు.. అప్పుడు అంటూ కాలయాపన కావడంతో పుణ్యకాలం గడిచిపోయింది. విత్తనం అదును దాటిపోయిందని, రబీ సీజన్‌లో భాగంగా సెప్టెంబర్ నెలలో పంపిణీ చేసే అవకాశం ఉందని అధికారుల ద్వారా తెలుస్తోంది.





రుద్రవరం వ్యవసాయ కార్యాలయంలో పంపిణీకి నోచుకోని సబ్సిడీ కంది, మినుము విత్తనాలు

మోడల్ స్కూల్ విద్యార్థికి అస్వస్థత



అస్వస్థతకు గురైన విద్యార్థి విజయ్‌కైలాస్

జూపాడుబంగ్లా: స్థానిక మోడల్‌స్కూల్‌లో మధ్యాహ్న భోజనం చేస్తూ విజయ్‌కైలాస్ అనే 8వ తరగతి విద్యార్థి అస్వస్థతకు గురయ్యాడు. విషయం తెలుసుకొన్న పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సుభాకర్, పీఈటీ పద్మావతి, పాఠశాల విద్యార్థులు కైలాస్‌ను హుటా హుటినా కారులో ప్రాథమిక వైద్య కేంద్రానికి తరలించారు. పీహెచ్‌సీ వైద్యురాలు సభా అస్వస్థతకు గురైన విజయ్‌కైలాస్‌కు వైద్య పరీక్షలు చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విజయ్‌కైలాస్‌కు ఫిట్స్ రావటంతో తోటి విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న కైలాస్ తండ్రి చిన్నతిరుపాలు ఆసుపత్రికి చేరుకోవ డంతో మెరుగైన చికిత్స నిమి త్తం 108లో కర్నూలు ప్రభు త్వ వైద్యశాలకు తరలించారు.

మద్యం కిక్కు.. ఆరోగ్యానికి చిక్కు!



మద్యం తాగడం ఆరోగ్యానికి హానికరం. ఇది అన్ని మద్యం బాటిళ్లపై రాసి ఉంటుంది. ఇందులో నాణ్యమైన మద్యం, కల్తీ మద్యం అన్న తేడా ఉండదు. ఏ మద్యం తాగినా కాలేయం చెడిపోవడం తథ్యం. ఒక్కమాటలో చెప్పాలంటే క్రమంగా వ్యాధులకు గురిచేసి ప్రాణాలు తీసే మహమ్మారి ఇది. కూటమి ప్రభుత్వం వచ్చాక విచ్చలవిడిగా మద్యం దుకాణాలు వెలియడంతో మద్యం తాగే వారి సంఖ్య విపరీతంగా పెరిగింది. మందుబాబులు పూటుగా మద్యం తాగి ఎక్కడ పడితే అక్కడ పడిపోతూ కనిపిస్తున్నారు. పలువురు వ్యాధుల బారిన పడి చనిపోతున్నారు. జిల్లాలో మద్యం తాగి మరణించే వారి సంఖ్య ఈ ఏడాది కాలంలో గణనీయంగా పెరగడమే అందుకు నిదర్శనం.

- మద్యం తాగి గతేడాది 271 మంది మృతి
- ఈ ఏడాది జూన్ నాటికి 97 మంది మృత్యువాత
- పెద్దాసుపత్రికి వచ్చే రోగుల్లో 50 శాతం మంది మద్యం బాధితులే
- ఏటా పెరుగుతున్న కాలేయం, క్లోమ గ్రంథివ్యాధి కేసులు
- వేధిస్తున్న ఫ్యాటీ లివర్, హెపటైటిస్ జబ్బులు

ఐదేళ్లలో మద్యం బాధితుల వివరాలు

సంవత్సరం	ఓపీ	ఐపీ	మరణాలు
2021	6,617	1,013	24
2022	8,943	1,449	35
2023	10,051	1,626	60
2024	15,564	3,366	271
2025 (జూన్ వరకు)	8,655	1,561	97

కర్నూలు(హాస్పిటల్): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మద్యం తాగడాన్ని కట్టడి చేసేందుకు మద్యం దుకాణాల సంఖ్యను గణనీయంగా తగ్గించింది. ప్రైవేటు దుకాణాలు, బెల్ట్‌షాపులకు చెక్ పెట్టింది. కేవలం ప్రభుత్వ మద్యం దుకాణాల్లోనే మద్యం విక్రయించేలా చర్యలు చేపట్టింది. మద్యం ధరలు సైతం షాక్ కొట్టేలా చర్యలు తీసుకుంది. ఈ కారణంగా మద్యం తాగే వారి సంఖ్య గణనీయంగా తగ్గింది. కానీ కూటమి సర్కారు ఏర్పడ్డాక ప్రైవేటు మద్యం దుకాణాలు మళ్లీ రాజ్యమేలుతున్నాయి. వాటిలో ఎలాంటి మద్యం విక్రయిస్తున్నారో అర్థం గాని పరిస్థితి. ప్రభుత్వం నాణ్యమైన మద్యం అని చెబుతున్నా దానిని తాగిన వారు ఎక్కువ మంది ఆసుపత్రి పాలవుతున్నారు. రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ తూలి, కూలిపోతున్నారు. ఫలితంగా మద్యంకారక వ్యాధులు అధికమయ్యాయి. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని జీర్ణకోశవ్యాధుల విభాగం (గ్యాస్ట్రో ఎంట్రాలజి)కు చికిత్స కోసం వచ్చే వారిలో 50 శాతం వరకు ఆల్కహాలు బాధితులే కావడం గమనార్హం. ప్రతిరోజూ, దీర్ఘకాలం అధిక మోతాదులో మద్యం సేవించడం ద్వారా కాలేయం దెబ్బతిని అది క్రమంగా లివర్ సిర్రోసిస్‌కు దారి తీస్తోంది. ఒకసారి సిర్రోసిస్ వచ్చిందంటే ప్రాణాంతకమై ప్రాణాలు పోయే అవకాశం ఉంది. గతంలో ఆల్కహాలు సేవనం వల్ల లివర్‌సిర్రోసిస్‌కు గురై ఆసుపత్రికి వచ్చే వారి సంఖ్య 20 శాతం కంటే తక్కువగా ఉండేదని, ఇటీవల ఈ సంఖ్య 40 శాతానికి మించిందని వైద్యులు చెబుతున్నారు. వీరితో పాటు ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ ప్రతిరోజూ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టుల వద్దకు మద్యానికి బానిసై వివిధ వ్యాధులకు గురై చికిత్స కోసం వచ్చే వారి సంఖ్య రోజుకు 200లకు పైగా ఉంటోంది.

మద్యం ఏదైనా ఒళ్లు గుల్లే...!

మద్యం తాగడం ఆరోగ్యానికి హానికరమని అటు బాటిళ్లపై, సినిమాల్లో తారలు మద్యం తాగేసమయంలో వచ్చే హెచ్చరికలు తెలియజేస్తున్నాయి. ఇందులో మంచి మద్యం, చెడు మద్యం అంటూ ఉండవు. ఎలాంటి మద్యం తాగినా ఒళ్లు గుల్ల కావాల్సిందే. మద్యం తాగడం వల్ల ముందుగా ఫ్యాటీ లివర్ వస్తుంది. ఈ స్టేజిలో మద్యం ఆపేసి చికిత్స తీసుకుంటే కాలేయం దెబ్బతినకుండా కాపాడుకోవచ్చు. ఆ తర్వాత వచ్చే ఆల్కహాలిక్ హెపటైటిస్ స్టేజిలోనూ మద్యం సేవనం ఆపేసి చికిత్స తీసుకుంటే 70 శాతం వరకు రోగిని రక్షించుకోవచ్చు. ఆ తర్వాత సిర్రోసిస్ వచ్చిందంటే కాపాడుకోవడం కష్టం. ప్రతిరోజూ విస్కీ 90ఎంఎల్, వైన్ 150ఎంఎల్, బీర్ 350ఎంఎల్ తాగే వారిలోనూ ఆల్కహాలిక్ లివర్ డిసీజ్ వస్తోందని వైద్యులు చెబుతున్నారు. ఆల్కహాలు కారణంగా ప్యాంక్రియాస్ జబ్బులు పెరిగి మెదడు, గుండెపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

మద్యపానంతో వచ్చే వ్యాధులు

ఆల్కహాలు సేవించడం వల్ల ముందుగా ఫ్యాటీ లివర్, లివర్ సిర్రోసిస్ వస్తుంది. శరీరంలో కొవ్వు శాతం పెరిగి గుండెజబ్బులకు దారి తీస్తుంది. అధిక రక్తపోటు, నాడీ మండల వ్యాధులకు గురిచేస్తుంది. నరాలు, కండరాలు పటుత్వాన్ని కోల్పోతాయి. ఎక్కువగా నోరు, అన్నవాహిక, గొంతు, లివర్, పాంక్రియాస్ క్యాన్సర్‌లకూ దారి తీస్తుంది. కడుపులో అల్సర్‌కు దారి తీసి అది ఒక్కోసారి క్యాన్సర్‌గా మారే అవకాశమూ ఉంది. ఆల్కహాలు సేవించడం వల్ల పాంక్రియాస్ జబ్బులు కూడా పెరుగుతున్నాయి. అది మెదడు, గుండెపై తీవ్రప్రభావం చూపుతుంది. రోడ్డు ప్రమాదాలు అధికమవుతున్నాయి. ఈ ప్రమాదాల్లో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. అతిగా మద్యం సేవించే వారు క్రమంగా సమాజం నుంచి దూరమవుతున్నారు. ఇన్ని నష్టాలున్న మద్యాన్ని తాగకపోవడమే మేలని వైద్యులు సూచిస్తున్నారు.

మద్యం ఏదైనా ఆరోగ్యానికి హానికరమే



మేము వారానికి ఒకసారి మాత్రమే తాగుతున్నాము. అది కూడా లిమిట్‌గా తాగుతున్నామని కొందరు చెబుతుంటారు. మద్యం ఎంత మోతాదులో తాగినా ప్రమాదమే. అతిగా మద్యం సేవించడం ద్వారా త్వరగా కాలేయం దెబ్బతింటుంది. లివర్ సిరోసిస్‌కు గురైన వారిని కాపాడటం కష్టంతో కూడుకున్నపని. మద్యం తాగడం కన్నా దానికి దూరంగా ఉంటేనే ఆరోగ్యానికి మంచిది.

–డాక్టర్ జి.మోహన్‌రెడ్డి, గ్యాస్ట్రో ఎంట్రాలజి హెచ్‌వోడి, జీజీహెచ్, కర్నూలు

ఎక్కువ మందికి ఫ్యాటీ లివర్



మద్యపానం వల్ల ఎక్కువ మంది ముందుగా ఫ్యాటీలివర్‌కు గురవుతున్నారు. ఇటీవల ఈ వ్యాధితో బాధపడే వారి సంఖ్య బాగా పెరిగింది. మద్యం తాగే సమయంలో కొవ్వు అధికంగా ఉండే పదార్థాలు తీసుకోవడం వల్ల కాలేయంపై కొవ్వు పేరుకుంటోంది. ఫ్యాటీలివర్‌ను త్వరగా గుర్తించి చికిత్స తీసుకోవాలి. నిర్లక్ష్యం చేస్తే కాలేయం దెబ్బతినే అవకాశం ఉంది.

–డాక్టర్ పి. అబ్దుల్ సమద్, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు, కర్నూలు

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో నంద్యాల జిల్లావాసి మృతి చెందిన ఘటన మంగళవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. నంద్యాల జిల్లా బనగానపల్లి మండలానికి చెందిన పాణ్యం రవి (30) చిలకలూరిపేట వైపునుంచి గుంటూరుకు తన ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. ఈ క్రమంలో ఎన్‌హెచ్ 16లో ఏటుకూరు వద్ద అకస్మాత్తుగా కుక్క రోడ్డుపైకి రావటంతో దాన్ని ఢీకొని ద్విచక్రవాహనంతో పాటు కిందపడిపోయాడు. అదే సమయంలో వెనుకగా చిలకలూరిపేట వైపునుంచి వస్తున్న లారీ అతనిని ఢీకొంది. ప్రమాదంలో రవి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలిసిన నల్లపాడు పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. లారీ ఢీకొని ఛిద్రమైన మృతదేహాన్ని కోవిడ్‌ఫైటర్స్ చారిటబుల్ ట్రస్ట్ సహాయంతో జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుని కుటుంబానికి సమాచారం అందించి మృతుని తండ్రి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఉద్యోగులకు పదవీ విరమణ సాధారణం



పదవీ విరమణ పొందిన ఆర్‌ఐలను సత్కరిస్తున్న కమాండెంట్ దీపిక పాటిల్

కర్నూలు: ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సర్వసాధారణమని, విధి నిర్వహణలో వారు అందించిన సేవలే శాశ్వతంగా గుర్తుండిపోతాయని ఏపీఎస్పీ కర్నూలు రెండో బెటాలియన్ కమాండెంట్ దీపిక పాటిల్ అన్నారు. బెటాలియన్స్ విభాగంలో సుదీర్ఘ కాలం సేవలు అందించిన ఆర్‌ఐలు ఎల్.శ్రీనివాస రెడ్డి, శివశంకర్ పదవీ విరమణ పొందారు. వీరు 1983లో ఏపీఎస్పీ విభాగంలో చేరి వివిధ హోదాల్లో సేవలు అందించారు. పదవీ విరమణ సందర్భంగా మంగళవారం సాయంత్రం పటాలంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమాండెంట్ దీపిక పాటిల్ వారిని పూలమాల, శాలువతో సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు. అడిషనల్ కమాండెంట్ నాగేందర్ రావు, అసిస్టెంట్ కమాండెంట్లు రమణ, రవికిరణ్, డీఎస్పీ సుధాకర్ రెడ్డి, బెటాలియన్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దన్న, ప్రధాన కార్యదర్శి హరిశ్చంద్ర తదితరులు హాజరై పదవీ విరమణ పొందిన ఆర్‌ఐలను సత్కరించి విధి నిర్వహణలో వారు అందించిన సేవలను కొనియాడారు.

మహిళలపై అఘాయిత్యానికి యత్నం!

- జీపులో అసభ్యకర ప్రవర్తన
- కిందకు దూకి బయటపడిన మహిళలు
- సిమెంట్ ఫ్యాక్టరీ సిబ్బందేనని బాధితుల వెల్లడి

కొలిమిగుండ్ల: తమ గమ్యస్థానానికి చేరుకునేందుకు సాయం కోరిన మహిళల పట్ల అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీకి చెందిన ఇద్దరు వ్యక్తులు అసభ్యకరంగా ప్రవర్తించారు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలోకి వెళితే...వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగుకు చెందిన ఇద్దరు మహిళలు.. ఓ వృద్ధురాలు, మూడేళ్ల పాపతో కలిసి సోమవారం స్టీల్ గిన్నెల వ్యాపారం కోసం గొర్విమానుపల్లెకు వెళ్లారు. తర్వాత తిరుగు ప్రయాణం చేసేందుకు వాహనాల కోసం నిలబడ్డారు. ఈలోగా సమీపంలోని అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీకి చెందిన బొలెరో జీపులో ఇద్దరు సిబ్బంది వస్తుండటంతో ఆపారు. బుగ్గ వరకు వస్తామని చెప్పడంతో వారిని ఎక్కించుకున్నారు. మార్గమధ్యలో లొక్కిగుండం వరకు పోగానే కొలిమిగుండ్ల పోవాల్సి ఉందని మాట మార్చారు. జీపులో ఉన్న ఇద్దరు వ్యక్తులు మద్యం మత్తులో మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం మొదలు పెట్టడంతో అనుమానం వచ్చింది. భయంతో జీపు ఆపి డిక్కీలోకి వెళ్లారు. పెట్నికోట సమీపంలోకి రాగానే సిమెంట్ ఫ్యాక్టరీ మైనింగ్ వైపునకు వాహనాన్ని తీసుకెళ్తుండటంతో గట్టిగా కేకలు వేస్తూ.. జీపు డోర్లు కొట్టినా ఆగకుండా పోనిచ్చారు. దీంతో భయ పడిన ఆ ఇద్దరు మహిళలు ఏమైనా అఘాయిత్యానికి పాల్పడుతారెమోనని చిన్న పాపతో కలిసి కిందకు దూకారు. ఈ ఘటనలో ముగ్గురు స్వల్పగాయాలతో బయటపడ్డారు. వాహనంలోనే ఉన్న వృద్ధురాలును కొలిమిగుండ్లలో వదిలిపెట్టి వెళ్లారు. తర్వాత బైక్‌లపై వెళుతున్న వారి సాయంతో బాధిత మహిళలు పెట్నికోటకు చేరుకొని పాపకు తలకు గాయం కావడంతో ఓ ఆర్‌ఎంపీ వద్ద ప్రాథమ చికిత్స చేయించారు. ఈలోగా గ్రామస్తులు అక్కడికి పెద్ద ఎత్తున చేరుకోవడంతో బాధిత మహిళలు జరిగిన తతంగాన్ని వివరించారు. విషయం తెలుసుకున్న పోలీసులు పెట్నికోటకు చేరుకొని వివరాలు ఆరా తీశారు. ఊరికి వెళ్లాలని జీపు ఆపి సాయం కోరితే తమ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి,సెల్‌ఫోన్ నెంబర్ ఇవ్వాలని కోరారని బాధిత మహిళలు వాపోయారు. జరిగిన ఘటనపై పోలీసులు తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ అంశంపై సీఐ రమేష్‌బాబు వివరణ కోరగా సమాచారం అందిన వెంటనే తమ సిబ్బంది ద్వారా బాధిత మహిళలను ఆటోలో స్వగ్రామానికి పంపించామని పేర్కొన్నారు. మహిళలు ఫిర్యాదు చేస్తే విచారణ చేసి బాధ్యులపై కేసు నమోదు చేస్తామన్నారు.

సంక్షోభంలో ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు

- వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కటికె గౌతమ్



విద్యార్థులతో మాట్లాడుతున్న కటికె గౌతమ్

కర్నూలు(అర్బన్): కూటమి ప్రభుత్వ హయాంలో సంక్షేమ వసతి గృహాలు సంక్షోభంలో కూరుకుపోయాయని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కటికె గౌతమ్ ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య నాయకత్వంలో ఈ నెల 28,29,30వ తేదీల్లో సంక్షేమ హాస్టళ్ల బాట కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి సూచన మేరకు నగరంలోని పలు హాస్టళ్లను పరిశీలించామన్నారు. డాక్టర్స్ కాలనీలోని బీసీ కళాశాల బాలుర వసతి గృహం వద్ద వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నేతలు మాట్లాడుతూ నగరంలోని పలు సంక్షేమ హాస్టళ్లు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, కనీసం మరుగుదొడ్లు, నిద్రించేందుకు గదులు, స్నానానికి, తాగేందుకు నీరు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. నాడు – నేడు ద్వారా వేల కోట్ల రూపాయలు వెచ్చించి పాఠశాలల రూపురేఖలు మార్చారన్నారు. 42 ఏళ్ల రాజకీయ అనుభవం, నాలుగు పర్యాయాలు ముఖ్యమంత్రి అని గొప్పలు చెప్పుకునే చంద్రబాబుకు విద్యార్థుల సమస్యలు, సంక్షేమ వసతి గృహాల అభివృద్ధి పట్టదన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో సకాలంలో విద్యా దీవెన, వసతి దీవెన, హాస్టల్ విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు విడుదలయ్యేవన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి హాస్టల్ విద్యార్థులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. కార్యక్రమంలో బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్రనాయుడు, నగర అధ్యక్షుడు స్వాములు, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనగర్ వెంకటేష్, విద్యార్థి విభాగం నగర అధ్యక్షుడు అన్సార్‌బాషా, జిల్లా నాయకులు తిరుమలేష్, శ్రీధర్, కోట్ల మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు యువకుల దుర్మరణం





మృతిచెందిన శాంతిరాజు, శివ

కోడుమూరు రూరల్: కోడుమూరు-కర్నూలు రోడ్డులో నెరవాడ వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గూడూరు మండలం చనుగొండ్ల గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు.. చనుగొండ్లకు చెందిన ఏబెల్ కుమారుడు శాంతి రాజు(20), యిర్మీయా కుమారుడు శివ(18) కర్నూలులో ఒకరు ఏసీ మెకానిక్, మరొకరు తాపీ మేస్త్రీగా పని చేస్తున్నారు. వారిద్దరూ కలిసి మంగళవారం రాత్రి కర్నూలు నుంచి బైక్‌పై స్వగ్రామం చనుగొండ్లకు బయలుదేరారు. మార్గమధ్యలో నెరవాడ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. వాహనదారులు గమనించి చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా కోలుకోలేక యువకులిద్దరూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కె.నాగలాపురం ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కాగా చేతికొచ్చిన కుమారులను రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబలించడంతో కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు వర్ణణాతీతం.

రెండో బెటాలియన్ పూర్వ కమాండెంట్ మృతి

కర్నూలు: ఏపీఎస్పీ కర్నూలు రెండో బెటాలియన్ పూర్వపు కమాండెంట్ రవిశంకర్ (63) అనారోగ్యంతో హైదరాబాదులోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు. ఈయన 2020 సెప్టెంబర్ 1 నుంచి 2024 జనవరి 31 వరకు కర్నూలు బెటాలియన్ కమాండెంట్‌గా పనిచేసి కడప బెటాలియన్‌కు బదిలీ అయ్యారు. పదవీ విరమణకు రెండు నెలల ముందు తిరిగి కర్నూలుకు బదిలీపై వచ్చారు. ఆగస్టు, సెప్టెంబర్ రెండు మాసాల పాటు కమాండెంట్‌గా పనిచేసి పదవీ విరమణ పొందారు. కొంతకాలం క్రితం అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు హైదరాబాదు ఆసుపత్రిలో చేర్పించగా కోలుకోలేక మృతిచెందారు. ఆయన మృతికి అధికారులు సంతాపం ప్రకటించారు.

మద్యం తాగేందుకు తీసుకెళ్లి దాడి



గాయపడ్డ కృష్ణ

ఎమ్మిగనూరురూరల్: మద్యం తాగేందుకు తీసుకెళ్లి వేటకొడవలితో దాడి చేశారు. సోమవారం రాత్రి జరిగిన ఈ ఘటనలో బాధిత వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే.. కోడుమూరుకు చెందిన ఎరుకుల కృష్ణ కొన్ని రోజులుగా గోనెగండ్లలో భార్య సుజాత దగ్గరే ఉంటున్నారు. ఆటో పెట్టుకొని గుజిరి వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రెండు రోజుల క్రితం కోడుమూరులోని తన ఇంటి పక్కనే ఉన్న బోయ రాములమ్మ అనే మహిళతో చెత్త విషయంలో కృష్ణ గొడవ పడ్డాడు.ఒకరికొకరు కోడుమూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. ఈ విషయాన్ని బోయరాములమ్మ తన కుమారుడైన బోయ ఠాగూర్‌కు తెలియజేసింది. దీనిని మనస్సులో పెట్టుకున్న అతను సోమవారం రాత్రి గోనెగండ్లకెళ్లి ఎరుకుల కృష్ణను కలిశాడు. మద్యం తాగుదామని చెప్పి గోనెగండ్ల-రాళ్లదొడ్డి గ్రామాల మధ్య ఉన్న కాలువ గట్టు వద్దకెళ్లారు. మద్యం తాగిన తర్వాత తన తల్లితో ఎందుకు గొడవపడ్డావని వాదనకు దిగి వెంట తెచ్చుకున్న వేటకొడవలితో కృష్ణపై దాడి చేశాడు. అతను ఎదురు దాడికి దిగడంతో ఠాగూర్ అక్కడి నుంచి పారిపోయాడు. దాడిలో తీవ్రంగా గాయపడిన కృష్ణ మార్గమధ్యంలో కాలువ గుంతలో పడిపోయాడు. మంగళవారం ఉదయం మెలకువ రావడంతో జరిగిన విషయాన్ని ఎమ్మిగనూరు రూరల్ పోలీసులకు తెలియజేయగా వారు మొదట చికిత్స నిమిత్తం కృష్ణను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నిందితుడిపై అట్రాసిటీ కేసుతో పాటు, హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

దొంగ అరెస్టు



నిందితుడిని అరెస్టు చూపిస్తున్న దృశ్యం

బనగానపల్లె: ఇంటి పక్కనే ఉండి చోరీకి పాల్పడిన వ్యక్తిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు..మండలంలోని ఇల్లూరుకొత్తపేట గ్రామంలో నూర్ అహమ్మద్, జాఫర్‌హుస్సేన్‌ల గృహాలు పక్కపక్కనే ఉన్నాయి. అయితే, వీరి మధ్య మనస్పర్థలు ఉండటంతో మాటల్లేవు. ఈ క్రమంలో ఈనెల 26వ తేదీన కుటుంబ సభ్యులతో కలిసి జాఫర్‌హుస్సేన్ తమ బంధువుల ఊరికి వెళ్లాడు. గమనించిన నూర్‌అహమ్మద్ రాత్రి ఇంటి తాళం పగలగొట్టి లోపలికి చొరబడి బీరువాలో ఉన్న రూ. 4.80 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు, వెండివస్తువులు చోరీ చేశాడు. మరుసటి రోజు ఇంటికి చేరుకున్న జాఫర్‌హుస్సేన్ ఇంటి తాళం, బీరువా తెరిచి ఉండటంతో చోరీ జరిగిందని నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన పోలీసులు మంగళవారం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. చోరీకి గురైన సొమ్ములో గోల్డ్ రింగ్ మినహా మిగతా ఆభరణాలన్నీ రికవరీ చేసినట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

బీసీ విద్యార్థులపై చిన్నచూపు

- వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర నాయుడు



కర్నూలు (టౌన్) : బీసీ హాస్టళ్లలో చదువుకునే విద్యార్థులపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని, హాస్టళ్ల నిర్వహణను గాలికి వదిలేసిందని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర నాయుడు విమర్శించారు. మంగళవారం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లోని సమావేశ హాలులో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. విద్యార్థులకు వడ్డించే మెనూ సక్రమంగా నిర్వహించడం లేదన్నారు. నీళ్ల చారు, రసంతో సరిపెడుతున్నారన్నారు. గత ప్రభుత్వంలో హాస్టళ్లు, పాఠశాలల నిర్వహణ ఉన్నతంగా ఉండేదన్నారు. ఇప్పుడు ఎక్కడా ఆపరిస్థితి లేదన్నారు. కూటమి సర్కారు ప్రజా సంక్షేమం పక్కన పెట్టి అక్రమ అరెస్టులు చేస్తూ రాష్ట్రంలో భయానక వాతావరణం కల్పిస్తుందన్నారు. రాబోయే రోజుల్లో బీసీ విద్యార్థుల సమస్యలపై ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

నిబంధనల మేరకే ఆస్తులు లీజుకు

- డీఆర్‌ఓ విచారణలో జిల్లా ఎన్‌జీఓ నేత వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ ఆస్తులను నిబంధనలకు లోబడే లీజుకు ఇచ్చామని, ఎక్కడా అక్రమాలకు తావు లేదని ఉమ్మడి జిల్లా శాఖ అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదోనిలోని ఎన్‌జీఓ అసోసియేషన్ ఆస్తులను నిబంధనలకు విరుద్ధంగా లీజుకు ఇచ్చి అక్రమాలకు పాల్పడ్డారని వచ్చిన ఫిర్యాదుపై జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరమణమ్మ విచారణ జరిపారు. జిల్లా అధ్యక్షుడు వెంగళ్‌రెడ్డితో పాటు ఆదోని తాలూకా మాజీ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి కూడా విచారణకు హాజరయ్యారు. ఆస్తులు లీజుకు ఇవ్వడానికి ఉన్న మార్గదర్శకాలు ఎలా ఉన్నాయి.. ఇక్కడ ఏ విధంగా లీజుకు ఇచ్చారనే దానిపై డీఆర్‌వో ఆరా తీసినట్లు సమాచారం. కాగా విచారణ అసంపూర్తిగా జరిగినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే మరోసారి విచారణ జరుపుతామని డీఆర్‌వో పేర్కొన్నట్లు తెలుస్తోంది. లీజు వ్యవహారం పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని ఫిర్యాదుదారులు పేర్కొంటున్నారు. కాగా ఎన్‌జీవో నేత వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్నారు. ఈయన జిల్లా ట్రెజరీ కార్యాలయంలో సీనియర్ అకౌంటెంటు.. ఎస్‌టీవోగా కొన్నేళ్ల క్రితమే పదోన్నతి లభించినప్పటికి తీసుకోకుండా ఎన్‌జీఓగా కొనసాగుతున్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు



అరెస్టు చేసిన పేకాట రాయుళ్లతో ఎస్ఐ, సిబ్బంది

పాములపాడు : బానకచర్ల గ్రామం సమీపంలోని నల్లమల అడవిలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. మొత్తం 18 మందిలో 11 మంది పరారుకాగా ఏడుగురు పట్టుబడ్డారు. వీరి నుంచి రూ. 62,400 నగదు, మూడు సెల్ ఫోన్లు, ఆరు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఆత్మకూరు టౌన్‌కు చెందిన మల్లికార్జున, ఇస్కాల పెద్ద మదిలేటి, పాములపాడు గంగాధర్ రెడ్డి, బండి ఆత్మకూరు సత్యనారాయణ, పెద్ద దేవలాపురం సుబ్బరాయుడు, ఎర్ర గుడూరు శ్రీరాములు , వెలుగోడు శివన్న పట్టుబడిన వారిలో ఉన్నట్లు ఎస్ఐ సురేష్ బాబు తెలిపారు. ముందస్తు సమాచారంతో ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్ కుమార్ రెడ్డితో కలిసి పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఆయన వెల్లడించారు.

యూరియా అధికంగా వేయొద్దు

నంద్యాల(అర్బన్): పత్తి పంటలో శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల సూచనల మేరకే యూరియా వేయాలని, అధికంగా వాడరాదని ఆర్‌ఏఆర్‌ఎస్ ఏడీఆర్ జాన్సన్, పత్తి కీటక శాస్త్రవేత్త డాక్టర్ శివరామకృష్ణ రైతులకు సూచించారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం వారు మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రస్తుతం పత్తి సాగు పూత దశలో ఉందని, పంటను పచ్చదోమ, పేనుబంక, తామపర పురుగులు ఆశించే వీలుందన్నారు. వీటి నివారణకు రైతులు ఫ్లోనికామిడ్ 0.3 గ్రాములు, డైనో తెఫ్యూరన్ 0.3 గ్రాములు, స్పైనోసాడ్ 0.3 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. యూరియా, పొటాష్ ఎరువులను ఈ దశలో పైపాటుగా వేయాలన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పొలంలో నీరు నిలబడితే వెంటనే తొలగించి కాపర్ యాక్సిక్లోరైడ్ 3 గ్రాముల మందు లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే భూమి నుంచి సంక్రమించే తెగుళ్లను అరికట్టవచ్చన్నారు. ముందుగా సాగు చేసిన పత్తి కాయదశలో ఉన్నందున గులాబీరంగు పురుగు యాజమాన్యంపై రైతులు శ్రద్ధ చూపాలన్నారు. గులాబీ పురుగు నివారణకు ఎకరాకు నాలుగు లింగాకర్షణ బుట్టలు ఉంచాలన్నారు.

పట్టు తప్పితే అంతే!





నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా కొందరిలో మార్పు రావడం లేదు. తమ వెనుక ఓ కుటుంబం ఉందనే విషయాన్ని మరచి నిర్లక్ష్యంగా ప్రయాణం చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఓ బాలుడు ట్రాక్టర్ ఇంజిన్‌కు గొర్రును తగిలించుకుని దానిపై కూలీలను ఎక్కించుకుని ప్రమాదకరంగా తీసుకెళ్తున్నాడు. ఏమాత్రం పట్టు తప్పినా విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోయే ఈ దృశ్యాలు కల్లూరు మండలం లక్ష్మీపురం గ్రామ సమీపంలో మంగళవారం కనిపించాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు